క్లుప్తంగా

వంతెన నిర్మించాలని వాగులోనే నిరసన


వాగులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కారణి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మించాలని ఆదివారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారణి గ్రామానికి వెళ్లే దారిలో వాగు ఉందని, వర్షాలు కురిసినప్పుడు ఉధృతంగా ప్రవహిస్తుందని, ఈ ప్రవాహంతో వాగు దాటలేకపోతున్నామని వాపోయారు. దీంతో నీరు తగ్గే వరకు ఎటూ పోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు వాగు ఉధృతి తగ్గకపోతుండటంతో నిత్యావసర సరుకులు, ఆరోగ్యం బాగలేక ఆసుపత్రులకు వెళ్లలేక అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పలు మార్లు కారణివాగు పై వంతెన నిర్మించాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికై న ఉన్నతాధికారులు స్పందించి కారణి వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి


మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి : ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తొలగించి కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి వంద రోజుల ప్రణాళికలో సెలవు దినాలు, ఆదివారాలు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ, పీఆర్సీ పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటముని, వెంకటాద్రి, మదన్‌మోహన్, రామసుబ్బయ్య, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

నారాయణవనం : మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో ఉదయమే మూలవిరాట్టుకు అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు. శింగిరి కోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలను నిర్వహించారు. ధన్వంత్రి, మహాలక్ష్మి హోమాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను ఆలయ ట్రస్టు అందజేసింది. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రతి రోజు మూడుపూటల అన్న ప్రదాలను అందజేస్తున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు గిరిబాబు, భాస్కర్‌బాబు తెలిపారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

రేణిగుంట (ఏర్పేడు) : రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రౌడీ షీటర్లకు ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేశారు. అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందని, శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్‌గా నమోదైన ప్రతి ఒక్కరూ బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకొని బైండోవర్ చేస్తామన్నారు.

పీహెచ్‌సీ వద్ద ప్రయాణికుల షెల్టర్



ఫ్లోరింగ్ దెబ్బతిన్న భీమునిచెరువు షెల్టర్



నిరుపయోగంగా సముదాయం షెల్టర్



ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

జాతీయ రహదారిపై లక్షల రూపాయలతో నిర్మించిన బస్ షెల్టర్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. షెల్టర్లలో కనీసం కూర్చొనేందుకు వీలు కాని దుస్థితికి చేరుకోవడంతో అవస్థలు పడుతున్నారు. ఫ్లోరింగ్ దెబ్బతినడం, వ్యర్థాలతో నిండిపోవడంతో ఎండా, వానల నుంచి తలదాచుకోలేని దుస్థితి నెలకొంది. షెల్టర్లు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం చేరి అసౌకర్యాలకు బస్ షెల్టర్లు నిలయంగా మారాయి.

- అధ్వానంగా బస్ షెల్టర్లు
- ఆరుబయట నిరీక్షణలతో అవస్థ
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


జాతీయ రహదారిపై అధ్వానంగా తుంబూరు బస్ షెల్టర్

నారాయణవనం: బస్ షెల్టర్లను ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక సంస్థల నిధులతో నిర్మించారు. నిర్వహణ, మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత మా పరిధిలోకి రాదంటూ ఎవరికి వారు దాట వేస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై బస్ షెల్టర్ల నిర్వహణ, సౌకర్యాల కల్పన, శుభ్రత బాధ్యతలు ఎవరూ పట్టించుకోకపోవడంతో బస్ షెల్టర్లు బిచ్చగాళ్లకు ఆవాసాలుగా మారాయి.

బస్ షెల్టర్ల తీరు ఇలా..

- నారాయణవనం మండలంలో జాతీయ రహదారి ఎత్తు పెరగడంతో తుంబూరు బస్ షెల్టర్‌లో మట్టి పేరుకుపోయింది. చినుకు పడితే నీరు చేరిపోవడంతో ప్రయాణికులు పక్కనే ఉన్న చెట్టు కిందే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది.
- భీముని చెరువు క్రాస్ వద్ద ఎంపీ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్ నాసిరకంగా నిర్మించడంతో ఫ్లోరింగ్ దిగపడిపోయింది. కూర్చునే సదుపాయం ఉన్నప్పటికి ఫ్లోరింగ్ లేని కారణంతో ప్రయాణికులు ఉండలేని పరిస్థితి దాపురించింది.
- సముదాయం గ్రామంలో బస్సులు ఆగే చోట కాకుండా మరో వైపుగా నిర్మించిన బస్ షెల్టర్‌కు ఇరువైపులా భవనాలు నిర్మించడంతో ప్రయాణికులు షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవడం లేదు.
- నార్ద్ స్వచ్ఛంద స్థంస్థ గ్రామ చావిడి, పీహెచ్‌సీ వద్ద నిర్మించిన బస్ షెల్టర్లను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకోవడంతో ప్రయాణీకులు రోడ్డు పక్కనే వేచి ఉండాల్సి వస్తోంది.
- నారాయణవనం బస్టాండ్ షెల్టర్ ముందు భాగంలో స్థూపాన్ని నిర్మించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీంతో బస్సు కోసం షాపుల మెట్లపై కూర్చుంటున్నారు.
- పుత్తూరు పైవంతెన వద్ద చెన్నై, సత్యవేడు మార్గంలో ప్రయాణికులతో రద్దీగా ఉండే పాలమంగళం వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం హైవే పక్కనే నిలబడే వేచి ఉండాల్సి వస్తోంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లకు మరమ్మతులు చేపట్టడం , పరిశుభ్రంగా ఉంచగలిగే ఏర్పాటు చేస్తే ఎంతో మంది ప్రయాణికులకు ఊరట కలుగుతుంది.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో 108 రోజుల పాటు నిర్వహించిన బీజాక్షర సాహితీ శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన మహాయజ్ఞం ఆదివారంతో పూర్తయింది. దీంతో పౌర్ణమిని పురస్కరించుకుని చంద్రపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ చల్లా జయరామయ్య, పేర్నేటి సుబ్రహ్మణ్యం, పిచ్చుక సుబ్రహ్మణ్యం, మునిరత్నం, రవిబాబు, నాగభూషణం, కన్నా నాగయ్య, బద్రి, మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

నారాయణవనం : మండలంలోని ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస పూజలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తమిళ ధనుర్మాసం సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ఆలయాలను వేకువ జామునే తెరిచి సుప్రభాతానికి మారుగా గోదాదేవి దివ్య ప్రవచనాలను నివేదిస్తారు. నిత్య, ధనుర్మాస పూజలను పూర్తి చేసి ఉదయపూర్వమే భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. టీటీడీ అనుబంధ ఆలయాలైన పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, అవనాక్షమ్మ, అగస్తీశ్వర, పరాసరేశ్వర, శక్తి వినాయక, వీరభద్ర స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం 6.45 గంటలకు ధనుర్మాస పూజలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. అలాగే పాలీశ్వర, తుంబీశ్వర, దూండి వినాయక స్వామి ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస పూజలను నిర్వహిస్తారు. భక్తులు వేకువజామునే ఈ పూజలకు హాజరై అమ్మవారి కటాక్షం పొందాలని అర్చకులు తెలిపారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


శ్రీకాళహస్తి : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

శ్రీకాళహస్తి : భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని పలువురు ఆర్యవైశ్యులు అన్నారు. పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని సుమారు 53 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడయ్యారన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే తెలుగువారికి రాష్ట్రం ఏర్పడిందని ఆయన మార్గం అనుసరణీయమని తెలిపారు. కార్యక్రమంలో వాకిచర్ల గుర్నప్పశెట్టి, జూలుగంటి సుబ్బారావు, సురేంద్రబాబు, మోహన్‌బాబు, మురళీకృష్ణ, లోకనాథం, కుమార్ పాల్గొన్నారు.

కోతుల బెడదతో అవస్థలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని గోపాలవనం ప్రాంతంలో కోతుల బెడద అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. పిల్లలు బయటకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. విపరీతంగా కోతులు తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపిల్లలు బయటకు వస్తే మీద పడి రక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతుల్లో ఏ వస్తువు ఉన్నా లాక్కుని వెళ్లిపోతున్నాయని తెలిపారు. పురపాలక సంఘం అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి గోపాలవనం ప్రాంతంలో కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతికం

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. నెల్లూరుకు చెందిన హరిణి బృందం ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు హరిణీకృష్ణ, ధరణీకృష్ణ, సంప్రీతిక, స్ఫూర్తి, మోక్ష, వినూత్న, రుష్మితశ్రీ, నయనికలు చూడచక్కని హావభావాలతో చేసిన నాట్యాభినయం రంజింపజేసింది. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.

అజరామరం.. ఘంటసాల గానం


గాయకుడు విల్సన్ హెరాల్డ్‌ను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తెలుగు పాట ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ఘంటసాల గానం అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకుని టీటీడీ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహతి కళాక్షేత్రంలో మనసు పరిమళించెనే పేరుతో చేపట్టిన సంగీత విభావరి ఆదివారం రాత్రితో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు ప్రదీప్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, శాప్ చైర్మన్ రవినాయుడు, యోధ గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్ యోగేష్, చదలవాడ సుమలత, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ సుమ ముద్దుబాల హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఘంటసాల కంఠస్వరం నుంచి జాలువారిన ప్రతి పాట అన్ని తరాలను ఉర్రూతలూగించే ఆణిముత్యాలన్నారు. అమరగాయకుడి పాటల మాధుర్యం అందించిన తిరుపతి ఫిలిం సొసైటీ నిర్వాహకులు అభినందనీయులని తెలిపారు. ఈ క్రమంలోనే గాయకుడు విల్సన్ హెరాల్డ్(చంద్రతేజ) ఘంటసాల పద్యాలను, పాటలను, భగవద్గీత శ్లోకాలను సుమధురంగా ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నారు. అలాగే సాయి శశాంక్, సుమనాస్, ప్రవస్తి, రాజు తమదైన శైలిలో ఘంటసాల యుగళ గీతాలను గానం చేసి శ్రోతల హృదయాలను రంజింపజేశారు. అనంతరం గాయనీ గాయకులను అతిథులు, నిర్వాహకులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఉత్తరాల పోటీల పొడిగింపు

నారాయణవనం : తపాలా శాఖ 'థాయ్ ఆఖర్' పేరున ఉత్తరాల పోటీలను జనవరి 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఐపీఓ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్) సతీష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గిందన్నారు. ఉత్తరాన్ని గుర్తు చేస్తూ తపాలాశాఖ 'ప్రియమైన నువ్వు ఓ ఉత్తరం పంపు' పోటీలను నిర్వహిస్తోందన్నారు. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెంట్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చునన్నారు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరుస్తూ చేతితో రాసిన వ్యాసాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు, ఇన్లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా వ్యాసం రాయాల్సి ఉంటుందని తెలిపారు. రాసిన ఉత్తరాన్ని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013 చిరునామాకు లేదా సమీపంలో తపాలా కార్యాలయాలకు జనవరి 31తేదీలోగా పంపాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేల ప్రైజ్‌మనీ ఉంటుందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలను తపాలా శాఖ అందిస్తుందని సతీష్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైస్కూల్ ఆట స్థలంలో అక్రమ నిర్మాణాలు


కరకంబాడి హైస్కూల్‌కు కేటాయించిన స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు

రేణిగుంట : మండలంలోని కరకంబాడి హైస్కూల్ ఆట స్థలంలో అక్రమ కట్టడాలు వెలస్తున్నాయి. నాలుగు నెలలుగా స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేత పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న హైస్కూల్ ఆట స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు కట్టి రూ.లక్షలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు 30 ఏళ్ల కిందట పంచాయతీ కార్యాలయం సమీపంలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి హద్దులు ఏర్పరిచి పాఠశాల ఆట స్థలంగా చూపారు. అయితే అందులో కొంత భాగం గుట్టగా ఉండటంతో విద్యార్థులు ఆడుకునే పరిస్థితి లేదు. దీంతో అదే అదనుగా భావించి ఆట స్థలాన్ని క్రమక్రమంగా ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. దీనిపై గతంలో పని చేసిన అనేక మంది హెచ్‌ఎంలు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. కొంతకాలం పాటు అక్రమ నిర్మాణాలు ఆగినా, గత నాలుగు నెలలుగా ఓ టీడీపీ నాయకుడు స్థానికంగా ఉన్న కొందరి నుంచి రూ.లక్షల్లో అక్రమ వసూలు చేసి యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర పలుకుతోంది. కొన్ని నెలలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ప్రస్తుత హెచ్‌ఎం కనీసం ఉన్నతాధికారులకు సమాచారం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొనడంతో రోజుకో ఇల్లు వెలుస్తోంది. రెవెన్యూ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలున్నాయి.

గిరిజనులకు రాయితీ రుణాలు ఇవ్వండి


సమావేశమైన గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

రేణిగుంట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సబ్సిడీ రుణాలిచ్చి కులవృత్తులను ప్రోత్సహించాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినారి ప్రభాకర్ తెలిపారు. ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం కార్యకర్తలతో ఆయన ఆదివారం రేణిగుంటలో సమావేశమయ్యారు. కె.ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గిరిజన తెగలో ఎరుకుల కులస్తుల చేతివృత్తులైన బుట్టల అల్లకం, బాతుల పెంపకం, ఉప్పు, పప్పు దినుసుల వ్యాపారం, సోది చెప్పడం వంటి వృత్తులు అంతరించిపోతున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఎరుకల సామాజిక వర్గానికి కాని వారికి ఎరుకుల కులస్తులుగా ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి మాత్రమే ఎరుకుల కులస్తులుగా సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, చీరాలయ్య, మునిస్వామి, వెంకటరమణ, యశ్వంత్, రాధిక, ప్రభాకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బుచ్చినాయుడుకండ్రిగ రహదారి



పదవ మైలు వద్ద అధ్వానంగా కేటీ రోడ్డు



ఈ రోడ్లింతే..

పోతే ప్రాణాలే!

అసలే గుంతలమయమైన రహదారులు.. ఆపై భారీ వర్షాల నేపథ్యంలో రహదారులు దారుణంగా మారాయి. అడుగుకో గుంత.. వాటిపై వెళ్తే విరిగే నడుములు.. రాళ్లు తేలిన రహదారులు.. ఏ మాత్రం ఆదమరిచినా ఆసుపత్రికే .. ప్రయాణికులకు ఒళ్లు హూనమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పగలే ఈ రోడ్లు చుక్కలు చూపిస్తున్నాయి.. ఇక రాత్రి ప్రయాణాలు ఇంటికి తిరిగొస్తేనే వచ్చినట్లు లెక్క.. ఇలా ఏ రహదారి తీసుకున్నా అదే పరిస్థితి.. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్లు తెరవడం లేదు.


తంగెళ్లపాళెం తెలుగు గంగ కాల్వ బ్రిడ్జి వద్ద గుంతలమయంగా రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి, తడ రోడ్డు తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాళహస్తి నుంచి తడ వరకు 44 కిలోమీటర్ల డబుల్ రోడ్డు ఉంది. మండలంలో శ్రీకాళహస్తి నుంచి వరదయ్యపాళెం మండలం వరకు 30 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. రోజు వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు వెంట ఉన్న ఆలత్తూరు, కుమ్మరవెంకటపురం, చల్లమాంబపురం, పదవమైలు, ఎన్‌టీఆర్‌నగర్, తలారివెట్టు, కారణిమిట్ట, నెలవాయి గ్రామాల వద్ద రహదారులు గుంతలమయమై దారుణంగా తయారయ్యాయి. వర్షం పడి గుంతల్లోకి నీరు చేరడంతో వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు పై వాహనాలు నడపటానికి చోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.


కుమ్మార వెంకటపురం రహదారి దుస్థితి ఇలా..


ఆలత్తూరు రోడ్డులో పెద్ద గుంత